


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 13 జూలై 2021 | సంపుటి : 02 | సంచిక :350 | పేజీలు : 4 | వెల : రూ 3-00







## మాస్కుల విషయంలో మరింత
# కఠినంగా ఏపీ ప్రభుత్వం



అమరావతి: కోవిడ్ నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం చేపట్టిన సమీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

### కోవిడ్‌పై సీఎం జగన్ సమీక్ష.. పలు కీలక నిర్ణయాలు

తీసుకున్నారు. మాస్క్ ధరించకపోతే రూ.100ల జరిమానా కచ్చితంగా అమలు చేసేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. దుకాణాల్లో కూడా సిబ్బంది దగ్గర నుంచి వినియోగదారులకు వరకూ మాస్కులు ధరించాల్సిందే. ఉల్లంఘనలకు పాల్పడితే దుకాణాలకు భారీ జరిమానాలతో పాటు అవసరమైతే 2-3 రోజులు దుకాణాలు మూసివేతకు ప్రభుత్వం ఆదేశించింది.ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఎవరైనా ఫొటో తీసి పంపినా జరిమానాలు విధించే విధంగా దీని కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు, రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ కఠినంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలెవ్వరూ గుమిగూడకుండా కఠిన ఆంక్షలతో పాటు మార్కెట్లు, తదితర చోట్ల కూడా మాస్కులు ధరించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. మార్కెట్ కమిటీలు మాస్కులు ధరించేలా చూడాలంటూ ప్రభుత్వం ఆదేశించింది.

డిగ్రీ విద్యార్థులకు వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత

ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లకు వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. డిగ్రీ విద్యార్థులకు వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని, కోవిడేతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం తెలిపారు. డెంగ్యూ, ఇతర వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం జగన్ పేర్కొన్నారు.

# ఘనంగా కొనసాగుతున్న పూరీ జగన్నాథ రథయాత్ర


### భక్తులు లేకుండానే కొనసాగురున్న రథయాత్ర
### భక్త జనకోటికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ / భువనేశ్వర్: జూలై 12 ఒడిశాలో పూరీ జగన్నాథ రథయాత్ర ఘనంగా కొనసా గుతున్నది. పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా భక్త జనకోటికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుభాకాంక్షలు తెలి పారు. ముఖ్యంగా ఒడిశాలోని భక్తులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీర్వా దంతో.. దేశ ప్రజలందరూ జీవితాంతం ఆనందంతో, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని కోరుకుంటున్నానని రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు.కరోనా కారణంగా జగన్నాథుని రథయాత్రను ఒడిశా ప్రభుత్వం ఈ ఏడాది పూరీకే పరిమితం చేసింది. గతేడాది మాదిరిగానే భక్తులు లేకుండా రథయాత్ర కొనసాగనుంది. రథయాత్ర నేపథ్యంలో పూరీలోని అన్ని దారులను మూసివేసి, రాకపోకలను రద్దు చేశారు. రేపు రాత్రి 8 గంటల వరకు పూరీలో కర్ఫ్యూ విధించారు. పూరీలోకి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రాకుండా ఉండేందుకు కర్ఫ్యూ విధించింది ఒడిశా ప్రభుత్వంకరోనా మహమ్మారి విస్తరణ కారణంగా గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం భక్తులను అనుమతించక పోయినా.. పూరీ రాజు, వేది పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది కలిసి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుక్ల విదియ నాడు అంటే ఇవాళ.. వేద పండితులు మేళతాళాలతో ఉదయకాల పూజలు నిర్వహించి 'మనిమా' (జగన్నాథా) అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఉత్సవమూర్తులను కదిలించడం ద్వారా రథయాత్రా పర్వం మొదలైంది.అనంతరం ఉత్సవమూర్తులైన సుభద్ర, జగన్నాథ, బలభద్రులను ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా ఊరేగిస్తూ రథం వెనుక భాగం నుంచి తీసుకువచ్చి రత్నపీఠం మీద అలంకరింపజేశారు.

# 'స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఢిల్లీలో మహాధర్నా

విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారం కోసం చేపట్టాల్సిన ఉద్యమంపై కార్యాచరణ రూపొందించినట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొంది. సోమవారం ఈ విషయమై కార్మిక సంఘాల నేతలు సమావేశం అయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్ట్ 2, 3 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం అన్ని పార్టీల మద్దతు కోరాలని నిర్ణయం తీసుకున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొన్నారు.



# ఏపీ రాజధాని జగడం




విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్)ఏపీ కి రాజధాని ఏది ? కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై తేల్చేసిందా ? అంటే.. తాజాగా జరిగిన పరిణామాలను బట్టి ఔననే అంటున్నారు విశ్లేషకులు. చంద్రబాబు హయాంలో అమరావతిని రాజధానిగా పేర్కొంటూ.. ఇక్కడ కొన్ని నిర్మాణాలు చేశారు. అయితే.. ఏ రాజధానికైనా సరిహద్దులను నిర్ణయించాలి. మరి ఎంతో మేధావిగా చెప్పుకొనే చంద్రబాబు.. ఈ విషయంలో ఎక్కడో తప్పులో కాలేశారు. అమరావతి అంటే..కేవలం సీఆర్డీఏ అంటూ.. చెప్పుకొచ్చారు. అదే సమయంలో శాశ్వత నిర్మాణాలు.. కూడా చేపట్టలేదు. హైకోర్టు సచివాలయం వంటి పలు నిర్మాణాలు.. తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టారు. దీనినే రాజధానిగా పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో ఆయన రాజధాని పేరుతో గ్రాఫిక్స్ మాయాజాలం చూపించారు.మళ్లీ అధికారంలోకి వస్తే.. శాశ్వత నిర్మాణాలు చేపడతామనే ఉద్దేశంతో దీనిని ఎన్నికలకు ముందు వాయిస్‌గా చేసుకున్నారు. అయితే.. అధికారం దక్కలేదు. ఈలోగా అధికారంలోకి వచ్చిన జగన్ పూర్తిగా రాజధానిపై యూటర్న్ తీసుకున్నారు. మూడు రాజధానులు ప్రకటించారు. అయితే..దీనిపై రాజధాని రైతులు న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు కూడా మూడు రాజధానుల కాన్సెప్ట్‌ను వ్యతిరేకించలేదు. కేవలం రైతులకు న్యాయం చేయాలనే విషయాన్ని మాత్రమే పరిశీలిస్తోంది. అయితే ఇప్పుడు ఇదే విషయం అమరావతికి శాపంగా మారిందని అంటున్నారు పరిశీలకులు.తాజాగా ఒకరు ఆర్టీఐ ద్వారా ఏపీకి రాజధాని ఏది ? అని ప్రశ్నించినప్పుడు కేంద్ర హోం శాఖ.. మూడు రాజధానులనే పేర్కొంటూ సమాధానం ఇచ్చింది. మూడు రాజధానులనే విషయం దీంతో స్పష్టమైంది. అయితే.. దీనికి కూడా ప్రాతిపదిక లేకపోవడం గమనార్హం. ఈ వివాదం ప్రస్తుతం హైకోర్టులో ఉంది. అయినప్పటికీ.. రాజధాని విషయంలో కేంద్ర ప్రభుత్వం అమరావతి అని కాకుండా.. మూడుకు మొగ్గు చూపడం.. ఏకంగా సమాచార హక్కు ద్వారా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడం వంటివి ఏకంగా.. రాజధాని విషయంలో కేంద్రం ఒక నిర్ణయానికి వచ్చిందనే సంకేతాలు వస్తుండడం గమనార్హం.

అన్నీ హైద్రాబాద్

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించారు. అప్పట్లో ఈ రాజధాని భూమి పూజకు ప్రధాని మోడి మట్టి-నీరు తెచ్చిన సంగతి తెలిసిందే. ఎపి రాజధానిగా అమరావతి నిర్ధారణ అయినప్పటికీ కేంద్రం మాత్రం ఇంకా రాజధానిగా గుర్తించలేనట్లుంది. కేంద్రలోని వివిధ శాఖల నుండి ఎపి రాజధానికి వస్తున్న లేఖలను చూస్తుంటేనే ఆ విషయం స్పష్టమవుతోంది.ఇటీవల కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి ఎపి ప్రధాన కార్యదర్శితో పాటు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులకు వస్తున్న లేఖల్లో.. ' ఎపి సెక్రటేరియేట్, హైదరాబాద్ ' అని రాస్తున్నారు. ఎపి ప్రభుత్వం నుంచి మాత్రం కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు అమరావతి చిరునామాతోనే జరుగుతున్నాయి. ఎపి సెక్రటేరియట్, అమరావతి కి బదులు హైదరాబాద్ అనే అడ్రస్‌తో ఉత్తరాలొస్తున్నాయి ! కరోనా వైరస్ డెల్టాప్లస్ వేరియంట్‌పై అప్రమత్తం చేస్తూ జూన్ 25 న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్‌కు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ రాసిన లేఖలో.. ఆదిత్యనాథ్‌దాస్ కార్యాలయం చిరునామా హైదరాబాద్ అని రాశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల నుండి ఎపి కి రాస్తున్న లేఖలలో చిరునామాలను చూస్తుంటే.. ఎపి కి రాజధానిగా అమరావతిని కేంద్రం గుర్తించలేదనే అనుమానాలు రాకమానవు లేదా నిర్లక్ష్యంగానైనా ఉత్తరాలు రాస్తుండాలి. కేంద్ర శాఖల నుండి వచ్చే లేఖలు నిర్లక్ష్యంతో రాస్తున్నారా ? లేదా తామింకా ఎపి రాజధానిగా అమరావతిని గుర్తించలేదన్న విషయాన్ని ఈ రూపంలో స్పష్టం చేస్తున్నారా ? అనే ప్రశ్నలు ఎపి అధికార వర్గాలను వెంటాడుతున్నాయి.


# దేశంలో కొత్తగా 37,154 కరోనా కేసులు..

### 97 శాతానికి పెరిగిన రికవరీ రేటు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. గత 24 గంటల్లో కొత్తగా 37,154 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 724 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కరోనా రికవరీ రేటు 97.22 శాతానికి పెరిగింది. ఇప్పటి వరకు కరోనాతో 4,08,764 మంది చనిపోయారు. కరోనా నుంచి మరో 39,649 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 3,00,14,713. దేశంలో ప్రస్తుతం 4,50,899 కేసులు యాక్టివ్‌గా ఉండగా, మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,08,74,376. ఇప్పటి వరకు 37.73 కోట్లకు పైగా టీకా డోసుల పంపిణీ జరగగా, గడిచిన 24 గంటల్లో 12,35,287 మంది టీకాలు వేయించుకున్నారు.



# ఈ నెల 19 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు: ఓం బిర్లా



న్యూఢిల్లీ: ఈ నెల 19 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. జూలై 19 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంటు సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. "19 పని దినాల పాటు పార్లమెంటు సమావేశాలు జరుగుతాయి...వవ అని బిర్లా వెల్లడించారు. త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఓం బిర్లా ఈ మేరకు ప్రకటించారు. సాధారణంగా ప్రతియేటా పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మూడో వారం నుంచి ప్రారంభమై ఆగస్టు 15కు ముందు ముగుస్తాయి.

# కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు: సజ్జల




గుంటూరు: కష్టపడిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పదవులు కొంతమందికి ముందు వస్తాయి మరికొందరికి తర్వాత వస్తాయని , అంతేగానీ పదవులు రాలేదని ఎవరూ కూడా నిరాశ పడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలో అందరికీ సమానంగా గౌరవం ఉంటుందన్నారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా నిబద్ధతతో నిజాయితీతో పని చేస్తున్నారన్నారు. ప్రజలతో ఉన్న అనుబంధమే వ్యక్తిని నాయకుడిని చేస్తుందని, సమాజం కోసం పని చేసే వ్యక్తులకు నాయకత్వ లక్షణాలు అవే వస్తాయని తెలిపారు. అలాగే పదవులు కూడా వాటంతట అవే వస్తాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుజువు చేశారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అందరికీ కుటుంబం వంటిదని సజ్జల పేర్కొన్నారు

## ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

అమరావతి: ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 2ను ఏపీ హైకోర్టు సస్పెండ్ చేసింది. పంచాయతీ సర్పంచులు, సెక్రటరీల అధికారాలను వీఆర్‌వోలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా తోకలవారిపాలెం సర్పంచ్ కృష్ణమోహన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరపున వాదనలు న్యాయవాది నర్రా శ్రీనివాస్ వినిపించారు. పంచాయతీ సర్పంచ్ అధికారాలు వీఆర్‌వోలకు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఇప్పటివరకూ సర్పంచులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన పాలనను వీఆర్‌వోలకు అప్పగించడమేంటని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది.

# 'టీడీపీ ఇప్పుడు తెలంగాణ దేశం పార్టీగా మారింది

తాడేపల్లి: చంద్రబాబు నాయుడుడి ఎప్పుడూ రెండుకళ్ల సిద్ధాంతమేనని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే చంద్రబాబు పని అని దుయ్యబట్టారు. సోమవారం మీడియాతో మాట్లాడిన మంత్రి అనిల్ కుమార్.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా టీడీపీ నేతలతో చంద్రబాబు లేఖ రాయించారని, రాయలసీమ లిఫ్టును ఆపేయాలంటూ టీడీపీ డిమాండ్ చేస్తోందని మండిపడ్డారు.టీడీపీ ఇప్పుడు తెలంగాణ దేశం పార్టీగా మారిందని, చంద్రబాబు హయాంలోనే తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులను కట్టిందని అనిల్ కుమార్ గుర్తుచేశారు. ఓటుకు కోట్లు కేసుకు భయపడే చంద్రబాబు నోరెత్తడం లేదని ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా చంద్రబాబు కేసులు వేశారని అన్నారు.



# సంపాదకీయం

మంగళవారం 13 జూలై 2021

## 2023లో ఏం రగబోతోంది?

కరోనా, కశ్మీర్ సమస్యలు కుదుటపడుతున్న తరుణంలో అన్ని పార్టీల చూపు అసెంబ్లీ ఎన్నికలపై పడింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగనున్న అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పార్టీలకు అగ్నిపరీక్షగా మారనున్నాయి. కీలకమైన యూపీ, దాని పక్కనే గల ఉత్తరాఖండ్, పంజాబ్, పశ్చిమాన గల గోవా, ఈశాన్య భారతంలోని మణిపూర్ అసెంబ్లీ ఎన్నికలను మినీ సార్వత్రిక ఎన్నికలుగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈఅయిదు రాష్టాల్లో జాతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయి. యూపీ, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ లో భాజపా, పంజాబ్ లో కాంగ్రెస్ పార్టీ చక్రం తిప్పుతోంది, ఈ ఎన్నికలు (2023 మార్చి) జరిగిన మరో ఏడాదిలో అంటే 2024లో కీలకమైన పార్లమెంటు ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో రెండు జాతీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నాయి. అధికారాన్ని కాపాడుకునేందుకు ఎత్తులు పైయెత్తులు, వ్యూహరచన దిశగా పావులు కదుపుతున్నాయి. ఏ ఒక్క చిన్న అవకాశాన్ని జారవిడుచుకునేందుకు జాతీయ పార్టీలు సిద్ధంగా లేవు. అయిదు రాష్టాల్లో అన్నింటికన్నా కీలకమైనది యూపీ. ఇది దేశానికి గుండెకాయ వంటిది. 80 పార్లమెంటు సీట్లు, 403 అసెంబ్లీ సీట్లు గల యూపీ పైనే అందరి చూపూ ఉంది. ప్రస్తుతం ఇక్కడ యోగీ ఆదిత్యనాథ్ నాయకత్వంలోని భాజపా సర్కారు అధికారంలో ఉంది. గత అయిదేళ్లుగా అధికారంలో ఉన్న యోగి తీరుపై పార్టీ శ్రేణుల్లోనే అసమ్మతి స్వరాలు వినపడుతున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఇటీవల యోగిని హస్తినకు పిలిపించి తలంటారన్న వార్తలు పార్టీలో పరిస్థితి అనుకున్నంత సవ్యంగా లేదన్న అభిప్రాయం కలిగించింది. ఇక మోదీకి ఇష్టుడైన గుజరాత్ క్యాడర్ కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఎ.కె.శర్మను రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడం యోగి అభీష్టానికి అనుగుణంగా జరిగిందని చెప్పలేం. 2017 ఎన్నికల్లో 312 సీట్లతో తిరుగులేని మెజార్టీని సాధించిన కమలం పార్టీకి ఇప్పుడు ఎదురుగాలులు వీస్తున్నాయి. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం. ఈ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి, అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్ వాదీ పార్టీ మొదటి స్థానంలో నిలవగా కమలం పార్టీ రెండో స్థానానికి పరిమితమవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కమలనాథుల్లో కలవరపాటు కనపడుతోందిఎన్నికలు జరగనున్న మరో కీలక రాష్ట్రం ఉత్తరాఖండ్. యూపీని విడగొట్టి 2000 సంవత్సరంలో దీనిని ఏర్పాటు చేశారు. 2017 ఎన్నికల్లో 70 సీట్లకు కమలం పార్టీ 57, కాంగ్రెస్ 11 సీట్లు గెలుచుకున్నాయి. అంతర్గత కలహాల కారణంగా 2019 మార్చిలో ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ ను మార్చి తీర్థ సింగ్ రావత్ ను సీఎం పీఠంపై కూర్చోబెట్టినప్పటికీ కుమ్ములాటలు కొలిక్కి రాలేదు. మరోసారి ముఖ్యమంత్రిని మార్చాల్సి వచ్చింది. గోవాలో తగిన బలం లేనప్పటికీ గవర్నర్ అండదండలతో 2017లో భాజపాకు చెందిన మనోహర్ పారికర్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. 2019 మార్చిలో పారికర్ మరణంతో ప్రమోద్ సావంత్ సీఎం పీఠాన్ని అధిష్టించారు. 60 సీట్లు గల గోవాలో 2017లో కాంగ్రెస్ 17 సీట్లు గెలిచింది. కేవలం 13 సీట్లే కైవశం చేసుకున్న బీజేపీ మాయోపాయాలతో అధికారాన్ని చేజిక్కించుకుంది. మణిపూర్ లోనూ ఇదే పరిస్థితి. మొత్తం 60 సీట్లకుగాను 2017 ఎన్నికల్లో కాంగ్రెస్ 28 సీట్లు సాధించింది. కేవలం 21 సీట్లు సాధించిన కమలం పార్టీ అధికార మాయోపాయాలతో బిరేన్ సింగ్ ను సీఎం పీఠంపై కూర్చోబెట్టింది. 117 సీట్లు గల పంజాబ్ లో కమలం ఉనికి దాదాపు శూన్యం. గత ఎన్నికల్లో అకాలీదళ్ తో పొత్తు పెట్టుకుని సాధించిన సీట్లు కేవలం మూడంటే మూడు. కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాల కారణంగా రెండు పార్టీల మధ్య గల దశాబ్దాల బంధం తెగిపోయింది. రేపటి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే కమలం ఉన్న సీట్లను నిలుపుకుంటే గొప్పే. మొత్తంమీద అయిదు రాష్టాల్లోనూ భాజపాకు అంతగా సానుకూల సంకేతాలు కనపడటం లేదన్నది రాజకీయ పండితుల అంచనా.

## విజయసాయి.. తప్పటడుగులు



విశాఖపట్టణం, జూలై 12, (న్యూస్ పల్స్)వును మరి అన్ని సమస్యలూ ఒక్కసారిగా తరుముకువస్తున్నాయి. పైగా అవతల వారు విసిరే సవాళ్ళు తట్టుకోలేనివిగా ఉన్నాయి. దాంతో వైసీపీ అధినాయకత్వంలో అసహనం కట్టలు తెంచుకుంటోందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ రెబెల్ ఎంపీ రఘురమ కృష్ణరాజు విషయం తీసుకుంటే ఏడాదిగా ఆయన మీద వేటు వేయాలని వైసీపీ డిమాండ్ చేస్తూ వస్తోంది. కానీ ఇప్పటిదాకా ఆ పని జరగలేదు సరికదా క్లరికల్ మిస్టేక్స్ అంటూ మళ్లీ ఫిర్యాదు చేయమనడం సాగదీత కోసమే అని ఎవరికైనా అర్ధమైపోతోంది. ఇక స్పీకర్ ఆఫీస్ కోరినట్లుగానే వైసీపీ ఎంపీలు రఘురామ మీద మళ్ళీ ఫిర్యాదు చేశారు. అనర్హత వేటు త్వరగా వేయాలని కోరారు. అయితే దీన్ని ప్రివిలేజ్ కమిటీ పరిశీలనకు పంపుతాను అంటూ స్పీకర్ కొత్త మెలిక పెట్టడంతో ఇపుడు వైసీపీ పెద్దలకు సహనం నశిస్తోంది.నిజానికి రాష్ట్రాలలో ఈ తరహా రచ్చ చూస్తూంటారు. స్పీకర్లు ఏకపక్షంగా ఉంటారని, అధికార పార్టీ కొమ్ము కాస్తారని విపక్షలు ఆరోపిస్తాయి. గత అయిదేళ్లలో వైసీపీ ఇలాగే అప్పటి స్పీకర్ కోడెల మీద కామెంట్స్ చేసేది. కానీ ఇపుడు ఏకంగా లోక్ సభ స్పీకర్ మీదనే విజయసాయిరెడ్డి గట్టిగానే మాట్లాడుతున్నారు. ఇదే విషయం మీద విజయసాయిరెడ్డి ఆ మధ్యన ఒక లేఖను స్పీకర్ ఆఫీస్ ని పంపినపుడే అందులో ఘాటైన పదజాలం ఉపయోగించారు. ఇపుడు స్పీకర్ ని కలసి వచ్చిన తరువాత మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు అంటూ హాట్ కామెంట్స్ చేశారు. అంటే వైసీపీ వార్ కి రెడీ అయిపోతోంది అన్న సంకేతాలు ఇచ్చేశారు అన్న మాట.నిజానికి ఇంత తొందర వైసీపీకి ఎందుకు వచ్చింది అంటే వర్షాకాల సమావేశాల్లో రఘురామరాజు తన పైన ఏపీ సీఐడీ విభాగం చేసిన దాడిని ప్రస్థావించడానికి తయారుగా ఉన్నారు. అది కనుక సభలో చర్చకు వస్తే వైసీపీ పరువు జాతీయ స్థాయిలో పోవడం ఖాయం. జగన్ ఇమేజ్ డ్యామేజ్ అవడమూ ఖాయమే. మరో వైపు చూస్తే అనర్హత పిటిషన్ మీద సాచివేత ధోరణితో కేంద్ర పెద్దలు ఉన్నారు అంటేనే రాజుకు మద్దతుగా నిలుస్తున్నారు అని అర్ధం చేసుకోవాలి. పేరుకు స్పీకర్ మీద వైసీపీ బాణాలు వేస్తున్నా అసలు యుద్ధం బీజేపీ పెద్దలతోనే అన్నది అందరికీ తెలిసిందే. ఈసారి సభలోకి రఘురామరాజు రానీయకుండా చేయాలన్న వైసీపీ పట్టుదలకు కూడా ఇపుడు అగ్ని పరీక్ష ఎదురవుతోంది.ఏ ప్రత్యేక హోదా విషయంలోనో విభజన హామీల మీదనో పార్లమెంట్ ని స్థంభింపచేస్తే వైసీపీకి ఒక విలువ గౌరవం పెరుగుతాయి. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అశం మీద చర్చ జరిపి కేంద్రాన్ని నిలదీసినా జనం మద్దతుగా నిలుస్తారు. కానీ వైసీపీ ఒక రెబెల్ ఎంపీ మీద వేటు వేయాలంటూ పార్లమెంట్ ని స్టాల్ చేస్తామని అంటోంది. దీని వల్ల బీజేపీ పెద్దల కన్నెర్రకు గురి కావడం తప్ప మరోటి జరగదు. అంతే కాదు జనాలకు కూడా ఇది పట్టే విషయం కాదు. ఇవన్నీ వైసీపీ ఎందుకు చేస్తోంది అంటే తీవ్రమైన వత్తిడితో పాటు నిండా అసహనం నింపుకోవడం వల్లనే అంటున్నారు. మొత్తానికి రాజు విషయంలో ఏమీ జరగదు అని గత ఏడాది పరిణామాలు సామాన్యుడికి కూడా అర్ధమవుతున్నా వైసీపీ దూకుడు చేస్తోంది అంటే ఫ్రస్టేషన్ తప్ప మరోటి కాదన్న మాటేగా.

## బడ్జెట్ లెక్కలు ఏంటీ

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్)రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్ తీరును అకౌంటెంట్ జనరల్ (ఎజి) తీవ్రంగా ఆక్షేపించారని విశ్వసనీయంగా తెలిసింది. బడ్జెట్‌లో వాస్తవికత లోపిస్తోందని, గత బడ్జెట్‌లలో లోటుపాట్లను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త బడ్జెట్‌ను రూపొందించడం సహేతుకం కాదని తేల్చిచెప్పారు. తాజా బడ్జెట్‌పైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లోటుపాట్లను సరిదిద్దాలని రాష్ట్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను ఎజి కోరారు. ప్రధానంగా అవధులు దాటి బడ్జెట్‌ను ప్రవేపెట్టడాన్ని ఎజి కార్యాలయం ప్రత్యేకంగా ప్రస్తావించింది. వార్షికాంతంలో తేలిన లెక్కలను పరిగణనలోకి తీసుకోకుండా మరిరత అధికంగా కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని ఎజి కార్యాలయం తప్పుపట్టింది.అందుకు ఉదాహరణలను కూడా నివేదికలో చూపించింది. గతేడాది సొంత పన్నుల ఆదాయం 81,819 కోట్ల రూపాయలు రాగా ఈ ఏడాది ఏకంగా 1.12 లక్షల కోట్లు వస్తాయని ప్రతిపాదించారని పేర్కొంది. మొత్తం ఆదాయం 2019-20లో 1.11 లక్షల కోట్లు, 2020-21లో 1.18 లక్షల కోట్ల రూపాయలు రాగా, ఈ ఏడాది ఏకంగా 1.77 లక్షల కోట్లు వస్తాయని చేసిన ప్రతిపాదనపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం పెరుగుతుందని అంచనా వేయడానికి ప్రాతిపదిక ఏమిటని ప్రశ్నించింది. వ్యయానికి సంబంధించి కూడా భారీగానే ప్రతిపాదించడాన్ని ప్రస్తావించింది. గతేడాది వాస్తవంగా 1.53 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది దాదాపు 30 వేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తామని ప్రతిపాదించడం ఎలా సబబని పేర్కొంది. కరోనా నేపథ్యంలో ఆదాయం తగ్గిపోతున్నప్పటికీ 50 శాతం ఆదాయం అదనంగా వస్తుందని పేర్కొనడంపై ఎజి కార్యాలయం విస్మయాన్ని వ్యక్తం చేయడంతో పాటు, ఆచరణలో ఆ లక్ష్యం చేరుకోవడం అనుమానవేనని వ్యాఖ్యానించింది.పలు శాఖల ద్వారా వచ్చే ఆదాయాన్ని భారీగా పెంచి చూపించారని పేర్కొంది. గత ఏడాది కన్నా స్టాంప్స్, రిజిస్ట్రేషన్లలో 43 శాతం, రాష్ట్రజిఎస్‌టిలో 64 శాతం, సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని 38 శాతం బడ్జెట్‌లో అదనంగా పెంచి ప్రతిపాదించిన విషయాన్ని ప్రస్తావించింది. పాలనాపరమైన అంశాల ద్వారా వచ్చే ఆదాయం 391 శాతం అదనంగా, విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల ద్వారా వచ్చే ఆదాయం ఏకంగా 1623 శాతం అదనంగా పెంచి చూపించడం గమనార్హం. అటవీ ఉత్పత్తుల ద్వారా గతేడాది కేవలం 31 కోట్ల రూపాయలు రాగా, ఈ ఏడాది రూ. 500 కోట్లు వస్తుందని చేసిన ప్రతిపాదనలనూ ఎజి కార్యాలయం తప్పు పట్టింది. ఇది ఏకంగా 1500 శాతానికి మించి ఉన్నట్లు వ్యాఖ్యానించింది.ఇక భారీగా చేస్తున్న రుణాలపైనా ఎజి కార్యాలయం ప్రస్తావించింది. 2019-20లో జిఎస్‌డిపిలో 31 శాతంగా ఉన్న రుణం గతేడాది 35.23 శాతానికి పెరిగిపోయిందని, ఈ ఏడాది బడ్జెట్‌లో దానిని ఏకంగా 36.46 శాతంగా అంచనా వేశారని పేర్కొంది. ఇక లోటు కూడా ఆశ్చర్యకరంగానే ఉందని పేర్కొంది. గత ఏడాది 35 వేల కోట్లు వరకు లోటు నిర్ధారణ కాగా, ఈ ఏడాది బడ్జెట్‌లో దానిని కేవలం ఐదు వేల కోట్లుగానే చూపించారని, ఖర్చులకు తగినట్లు ఆదాయాన్ని కూడా పెంచి చూపించడం వల్లనే లోటు తగ్గినట్లుగా చూపించారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది

## ధాన్యం కొనుగోళ్లు కష్టమే

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్) రబీలో ధాన్యం కొనుగోళ్లకు ఆర్థిక సమస్య వెంటాడుతోరది. ప్రభుత్వం నుంచి రావాల్సిన పాత సబ్సిడీ నిధులు రాకపోవడం, అప్పులు చేసేందుకు కూడా ఇబ్బందులు తలెత్తుతుండడం వల్ల రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన ధాన్యానికి నిధుల సమస్య నెలకొంటోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వడ్డీలకు ప్రతి నెలా వందలాది కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి కూడా పౌర సరఫరాల సంస్థకు సంకటంగా మారింది. ఈ నేపథ్యరలోనే నిధులిచ్చి ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరుతోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు 9,530 కోట్ల రూపాయలు అవసరముంటుందని పౌర సరఫరాల సంస్థ అంచనా వేసింది. మొత్తం 45 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తం నిధుల అంచనాలో రూ.8,524 కోట్లు నేరుగా రైతులకు చెల్లించాల్సి ఉంటుందని, మరో రూ.300 కోట్లు గోనె సంచుల సమీకరణకు, ధాన్యం సేకరిరచే సంస్థలకు కమిషన్‌గా రూ.140 కోట్లు, రవాణాకు రూ.150 కోట్లు, సార్టెక్స్ ఛార్జెస్ కింద రూ.210 కోట్లు, మార్కెట్ రుసుముగా రూ.85 కోట్లు, స్టోరేజికి రూ.50 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆ సంస్థకు చెందిన అధికారులు చెబుతున్నారు. వీటికి తక్షణ నిధులు అవసరమని, మొత్తం అంచనాలో కనీసం ఐదు వేల కోట్లు ముందుగా ఇవ్వాలని ఆ సంస్థ కోరుతోంది. పలు రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ బియ్యానికి సంబంధించిన నగదును చాలా సంవత్సరాలుగా పౌర సరఫరాల సంస్థకు చెల్లించడం లేదని తెలుస్తోరది. 2017-18 నుంచి కూడా సబ్సిడీ బకాయిలు పేరుకుపోయి ఇప్పటికి 17 వేల కోట్ల రూపాయల వరకు చేరిపోయినట్లు సంస్థ చెబుతోంది. ఈ నిధులు రాకపోవడం వల్ల రైతులకు తాము చెల్లించాల్సిన నగదు కూడా చెల్లించలేకపోతున్నామని, దీంతో రైతులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని సంస్థ అధికారులు వాపోతున్నారు. ప్రస్తుత తరుణంలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీ నిధులను ఉపయోగించుకుని ముందుకు సాగాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ధాన్యం సేకరణ, ఇతర అవసరాలకు బ్యాంకుల నుంచి తీసుకుంటున్న రుణాలు గరిష్ట స్థాయికి చేరిపోయాయని, ఈ రుణాలపై ప్రతి నెలా రూ. 175 కోట్లు వడ్డీగా చెల్లించాల్సి వస్తోందని అధికారులు చెబుతు న్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం కొనుగోళ్లు, చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ నిలుపు చేయడం కుదరదని, అందుకే తక్షణం నిధులు సమకూర్చాలని సంస్థ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.రైతులకు పౌరసరఫరాల సంస్థ ఎంత బకాయి ఉంది ? ఈ ప్రశ్నకు సంస్థ అధికారులు స్పష్టమైన జవాబు ఇవ్వడం లేదు. అధికారికంగా విడుదల చేసిన సమాచారం ప్రకారం జూన్ 29 నాటికి రైతులకు రూ.2,882.63కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. జూలై 9నాటికి మరో రూ.475.39కోట్లు విలువగల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ సేకరించింది. సంస్థ ఎండి సూర్యకుమారి కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణం, వాటి విలువ మాత్రమే చెబుతున్నారు కాని, చెల్లింపులు, బకాయిలు వివరాలపై పెదవి విప్పడం లేదు. రైతులు మాత్రం 1.50 లక్షల మందికి సంబంధించి రూ.2వేల కోట్లు వరకు బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం రోజుకు 200 కోట్ల రూపాయలు విడుదల చేస్తోందని సంస్థ అధికారులే ప్రకటించారు. ఆ మేరకు ప్రతిరోజు నిధులు విడుదల య్యాయా..లేదా అన్నది కూడా సందేహంగా మారింది. విడుదలైతే ఆ మొత్తాన్ని రైతులకు చెల్లిం చారా? ఇతర అవసరాలకు మళ్లించారా..అన్న విషయంపై కూడా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## రఘురామ వర్సెస్ వైసీపీ

ఏలూరు, జూలై 12, (న్యూస్ పల్స్)లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాపై వైసీపీ ఎంపీలు ఒత్తిడి పెంచుతున్నారు. పార్టీలో తిరుగుబాటు ఎంపి రఘురామ కృష్ణరాజుపై అనర్హత వేటు వేయించటమే లక్ష్యంగా పార్టీ ఎంపిలు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే నాలుగుసార్లు స్పీకర్ ను కలిసిన ఎంపిలు తాజాగా కూడా కలిశారు. తిరుగుబాటు ఎంపి అనర్హత వేటు వేయటంలో జరుగుతున్న జాప్యంపై చర్చించారు.రాజ్యసభ ఎంపి విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి, మార్గాని భరత్ స్పీకర్ తో భేటీ అయ్యారు. తమ విజ్ఞప్తులపై చర్యలు తీసుకోవటంలో జరుగుతున్న ఆలస్యంపై కాస్త అసంతృప్తిని కూడా వ్యక్తం చేశారట. ఈమధ్య హోంశాఖ మంత్రి అమిత్ షా ను జగన్మోహన్ రెడ్డి కలిసిన విషయం తెలిసిందే. వాళ్ళ భేటిలో చర్చకు వచ్చిన అనేక అంశాల్లో రఘురామపై అనర్హత వేటు కూడా ఒకటి. తాజాగా స్పీకర్ తో జరిగిన భేటీలో ఎంపికి వ్యతిరేకంగా అనేక సాక్ష్యాలు అందించారు.జగన్ తో విభేదాలు వచ్చి పార్టీకి దూరంగా జరిగిన ఎంపి తన మానాన తానుంటే సరిపోయేది. అయితే అలా ఉండకుండా ముందు ప్రభుత్వంపైన తర్వాత జగన్ పైన వ్యక్తిగతంగా కూడా తనిష్టం వచ్చినట్లు మాట్లాడారు. అక్రమాస్తుల కేసుల విచారణను ఎదుర్కొంటున్న జగన్ బెయిల్ రద్దు చేయాలని కోర్టులో పెద్ద పోరాటమే చేస్తున్నారు.నిజానికి ప్రభుత్వానికి, జగన్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంపికి లేనేలేదు. జగన్ తో పడలేదంటే కామ్ గా దూరంగా ఉండిపోతే సరిపోయేదేమో. కావాలని తెరవెనుక కొందరు జగన్ వ్యతిరేకులు ఆడించినట్లు ఆడుతుండటంతో వివాదం పెద్దదయిపోయింది.

## కొడాలి నాని కంటిన్యూ....



విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ తన మంత్రి వర్గాన్ని విస్తరించనున్నారు. అయితే ఏ మంత్రి కేబినెట్ లో ఉంటారు? ఎవరు వెళతారు? అన్న చర్చ వైసీపీలో జోరుగా సాగుతుంది. ఈ పరిస్థితుల్లో కొందరు మంత్రులు మాత్రం కొనసాగే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎన్నికల కేబినెట్ కావడం, వారి అవసరం పార్టీకి ఉండటంతో కొందరిని తప్పనిసరిగా కొనసాగిస్తారన్నది వాస్తవం. జగన్ కు కూడా అది అవసరమే. కొనసాగే మంత్రుల్లో కొడాలి నాని ముందువరసలో ఉన్నారంటున్నారు.కొడాలి నాని కమ్మ సామాజికవర్గానికి చెందిన నేత. పార్టీ వాయిస్ ను బలంగా విన్పించే నేత. ఈ రెండేళ్ల కాలంలో మిగిలిన మంత్రులతో పోల్చుకుంటే కొడాలి నాని ప్రత్యర్థి పార్టీలపై చేసిన విమర్శలు ఆయన పదవిని కాపాడేలా ఉన్నాయి. కొడాలి నాని భాష అభ్యంతరం కావచ్చు. కొందరికి నచ్చకపోవచ్చు. అయితే విషయాన్ని ప్రజల్లోకి సూటిగా తీసుకెళ్లగలిగేది కొడాలి నాని మాత్రమేనన్నది వైసీపీ క్యాడర్ లో బలంగా ముద్రపడిపోయింది.ప్రధానంగా చంద్రబాబు, లోకేష్, మీడియా అధిపతులపై విమర్శలు కొడాలి నాని చేసినంత ఘాటుగా మరెవ్వరూ చేయలేరు. జనాల్లోకి ఇది బాగా వెళుతుందన్నది వాస్తవం. కొడాలి నాని విమర్శలకు అవతలి వైపు నుంచి కౌంటర్లు కూడా ఈ రెండేళ్లలో పెద్దగా కన్పించలేదు. దీంతో కొడాలి నాని జగన్ కు మరింత దగ్గరయ్యారన్నది వైసీపీలో ప్రస్తుతం విన్పిస్తున్న టాక్. జగన్ స్వయంగా కొడాలి నాని చేత ప్రెస్ మీట్ పెట్టించమని చెబుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు.ఇక కొడాలి నానిని కొనసాగించేందుకు మరో బలమైన కారణం కూడా ఉంది. కమ్మ సామాజికవర్గం నుంచి గెలిచిన వారిలో ఎవరూ పార్టీలో అంత సీనియర్ లేరు. అంత గట్టిగా మాట్లాడే వారు కూడా లేరు. కేబినెట్ లో కమ్మ సామాజిక వర్గానికి ఖచ్చితంగా చోటు ఇవ్వాలి. జగన్ కు కొడాలి నాని తప్ప మరో ఆప్షన్ లేదు అన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. మొత్తం మీద మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా కొడాలి నాని సీటు మాత్రం పదిలమే.

## సీనియర్లకు కాదు..ఈ సారి జూనియర్లు

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు 2024 ఎన్నికలు చావోరేవో అని చెప్పకతప్పదు. ఈ ఎన్నికల్లో విక్టరీ మిస్ అయితే పార్టీ మనుగడ కూడా కష్టమే. అందుకే చంద్రబాబు మూడేళ్ల ముందు నుంచే అన్ని రకాల ఈక్వేషన్లతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. జగన్ ప్రస్తుతం అన్ని రకాలుగా బలవంతుడు. రాజకీయంగా, ఆర్థికంగా జగన్ ను తట్టుకోవాలంటే అందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలను సమకూర్చుకోవాలన్నది చంద్రబాబు ఆలోచన.జగన్ అధికారంలోకి రాగానే తెలుగుదేశం పార్టీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీశారు. దీంతో అనేక మంది నేతలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో సహజంగానే వైసీపీకి ఎడ్జ్ ఉంటుంది. ఆ సంగతి చంద్రబాబుకు తెలియంది కాదు. 2014 ఎన్నికల్లో కొన్ని తప్ప మెజారిటీ ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలు వైసీపీకే దక్కాయి. 2019 లో కూడా అదే పరిస్థితి. ఇందుకోసం చంద్రబాబు ఆ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిసింది.పాత నేతల స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పిస్తే కొంత ఫలితం ఉంటుందని చంద్రబాబు భావిస్తున్నారు. సీనియర్ నేతలనుకూడా పక్కన పెట్టాలని యోచిస్తున్నారు. ఇందులో భాగంగానే యర్రగొండపాలెంకు ఎరిక్సన్ బాబును ఇన్ ఛార్జిగా నియమించారు. ఎరిక్సన్ బాబుది కనిగిరి నియోజకవర్గం. అయితే పార్టీనే నమ్ముకుని ఉండటంతో అక్కడ ఉన్న వారిని కాదని, తిరిగి పార్టీలోకి వచ్చిన డేవిడ్ రాజును కాదని ఎరిక్సన్ బాబుకు అప్పగించారు. యువకుడు కావడంతో కొంత పార్టీని ముందుకు తీసుకెళ్లే అవకాశాలు కన్పిస్తున్నాయి.ఇక తిరువూరు నియోజకవర్గంలో అయితే సీనియర్ నేతలు స్వామిదాస్ కు చంద్రబాబు మళ్లీ ఝలక్ ఇచ్చారు. ఇక్కడ ఇన్ ఛార్జిగా దేవదత్ ను నియమించారు. ఎన్నారై కావడంతో ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో చంద్రబాబు ఆయనను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కొన్ని కీలకమైన వాటిల్లో సీనియర్లను పక్కన పెట్టి కొత్తవారిని ఎంపిక చేయాలన్నది చంద్రబాబు ఆలోచన. ప్రస్తుతం చంద్రబాబు అదే పనిలో ఉన్నారు. మరి ఈ ప్రయోగం ఎంతమేర సక్సెస్ అవుతుందో చూడాలి.

## అంబటి, ప్రసన్నలకు ఛాన్స్

గుంటూరు, జూలై 12, (న్యూస్ పల్స్)మంత్రివర్గ విస్తరణ త్వరలో జరగనుంది. జగన్ అన్ని విధాలుగా చూసుకుని తన కేబినెట్ ను ఏర్పాటు చేసుకోనున్నారు. ఎన్నికలకు ఇదే కేబినెట్ తో వెళ్లనుండటంతో ప్రతి సున్నితమైన అంశాన్ని జగన్ పరిశీలించనున్నారు. అయితే వైసీపీలో ఇద్దరు నేతల గురించి హాట్ హాట్ చర్చ జరుగుతుంది. నోరు జారి అందివచ్చిన పదవిని వీరిద్దరూ పోగొట్టుకున్నారా? అన్న అనుమానాలను సీనియర్ నేతలు సయితం వ్యక్తం చేస్తుండటం విశేషం.వైసీపీలో సీనియర్ నేతలు అంబటి రాంబాబు, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి. అంబటి రాంబాబు పార్టీకి గట్టి గొంతుకగా నిలుస్తున్నారు. విపక్షంలో ఉన్నప్పటి నుంచి పార్టీ స్టాండ్ ను చెప్పడంలోనూ, వైరి పక్షాన్ని విమర్శించడంలోనూ అంబటి రాంబాబు దిట్ట. జగన్ కు అత్యంత సన్నిహితుడిగా పేరుపడ్డారు. అయితే ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. తన సామాజికవర్గమైన కాపులపైనే ఆయన వ్యాఖ్యలు చేశారు.కాపు సామాజికవర్గం ఇప్పటికే వైసీపీకి దూరమయ్యేట్లు ఉంది. అలాంటి పరిస్థితుల్లో అంబటి రాంబాబు కాపులపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కాపు సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తమయింది. దీంతో అంబటి రాంబాబు క్షమాపణ చెప్పుకోవాల్సి వచ్చింది. అయినా ఇది అంబటి రాంబాబుకు రాజకీయంగా ఇబ్బంది కలిగించే విషయమే. ఈ అంశం ఆధారంగా జగన్ తన కేబినెట్ లోకి ఈసారి కూడా తీసుకునే అవకాశం లేదంటున్నారు.ఇక కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీకి విజయమ్మతో పాటు తొలి ఎమ్మెల్యే. అలాంటి సీ?నియర్ నేతకు జగన్ ఈసారి తన మంత్రివర్గంలో చోటు కల్పిస్తారన్న అంచనా ఉంది. అయితే ఆయన కూడా నోటి దూలతో మంత్రిపదవిని దూరం చేసుకున్నారనిపిస్తోంది. జగనన్న పక్కా ఇళ్లు శోభనానికి కూడా పనికిరావని ఆయన చేసిన వ్యాఖ్యలపై జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం.

# ఏపీకి ముందుంది...మొసళ్ల పండుగేనా

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి బాగోలేదని అందరికీ తెలుసు. చంద్రబాబు నాయుడు దిగిపోయే సమయానికే సంక్షోభం పతాకస్థాయికి చేరింది. అయితే కేంద్ర ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా చివరి సంవత్సరం తెలివిగా మేనేజ్ చేశారు. ఫలితంగా ఎఫ్ఆర్బీఎం వంటి చట్టబద్ధమైన రుణ పరిమితుల చట్రంలోకి రాకుండా తప్పించుకున్నారు. చంద్రబాబు పదవి నుంచి దిగిపోయే చివరి త్రైమాసికంలో 20 వేల కోట్ల రూపాయల వరకూ అప్పులు తెచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి మరింతగా విజృంభించి రుణాలు దూసి తెస్తున్నారు. విస్తారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అంతా బాగానే ఉంది. కానీ ఈ ఏడాది గడిచేదెలా? అన్న సమస్య ఆర్థిక నిపుణులను వేధిస్తోంది. జీతాలకు కటకట ఎదురవుతుండటమే కాదు. కేంద్రం సైతం పూర్తి స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పై నిఘా పెట్టింది. ఆర్థిక క్రమశిక్షణ కట్టు తప్పిందని సాధికారికంగా అభిప్రాయానికి వచ్చింది. అందువల్ల ఆంక్షల అమలుకు సిద్ధమవుతోంది. దీంతో రాష్ట్రం విలవిలలాడక తప్పని స్థితి ఎదురవుతోంది.కేంద్ర ఆర్థిక శాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభుత్వ వ్యయం, ఖర్చులు, అప్పులు, రుణపరిమితులపై ఆరా అడిగింది. దీనిపై పూర్తి వివరాల తర్వాతనే ఎఫ్ ఆర్ బీఎం మినహాయింపులు ఇస్తామని పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తెలివిగా వ్యవహరించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల లెక్కలు పూర్తిగా మదింపు కాలేదనే నెపంతో పాత లెక్కలనే సమర్పించింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ కాలంలో 2017-18,2018-19 నాటి రెండేళ్ల వార్షిక లెక్కలు కేంద్రానికి పంపించింది. అప్పటికే రాష్ట్రం అప్పు చేసి పప్పు కూడు తరహాలో పరిధులు మించిపోయిందని కేంద్రానికి అర్థమైంది. ప్రభుత్వం పంపించిన పాత పద్దులను ప్రామాణికంగా తీసుకుంటూ 17 వేల కోట్ల రూపాయల మేరకు కొత్త రుణాలపై ఆంక్షలు పెట్టింది. అభివృద్ధి పద్దులో నిధులు ఖర్చు చేయలేదనేది కేంద్రం చూపిన నిబంధన. రాజకీయంగా నష్టం జరగకుండా ఇవన్నీ చంద్రబాబు నాయుడి కాలం నాటివని చెప్పుకోవచ్చు. కానీ కొత్త పద్దులు మరింత భయంకరంగా ఉంటాయని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం కేంద్రం విధించిన కోత చంద్రబాబు సమయం నాటి ప్రభుత్వ వైఫల్యమే. అయితే జగన్ టైమ్ మొదలయినప్పట్నుంచీ మరింత ఆర్థిక అయోమయం నెలకొందంటున్నారు. అంటే వైసీపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం పెట్టదలచుకున్న ఆర్థిక వాతలకు ఇంకొంత సమయం పడుతుందన్నమాట.కేంద్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంకుకు రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులపై సర్క్యులర్ పంపినట్టు సమాచారం. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పై రిజర్వు బ్యాంకు సైతం బిగింపులు మొదలు పెట్టింది. సెక్యూరిటీల విక్రయం ద్వారా అధిక వడ్డీతో ఏపీ ప్రభుత్వం రెండు వేల కోట్ల రూపాయల వరకూ నిధులను సమీకరించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వమూ రెవిన్యూ లోటును భర్తీ చేస్తూ 1400 కోట్లు విడుదల చేసింది. ఇందులో 2700 కోట్ల రూపాయలను రిజర్వ్ బ్యాంకు తొక్కిపెట్టి ఓవర్ డ్రాఫ్ట్ పద్దు కింద జమ చేసుకుంది. అంటే అధిక వడ్డీపై తెచ్చుకున్న అప్పు , ఇప్పటికే వాడుకున్న మొత్తానికి చెల్లిపోయింది. ఇక పై కఠినంగా వ్యవహరిస్తారనేందుకు ఇదొక సంకేతంగా ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. రోజువారీ నిర్వహణ కోసం ఓవర్ డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్, సెక్యూరిటీల విక్రయం వంటి అన్నిరకాల ఆర్థిక సదుపాయాలను ప్రభుత్వం వినియోగించుకొంటోంది. గడచిన మూడు నెలల్లో ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలను రుణాల రూపంలో తెచ్చుకుంది. మరో 4 వేల కోట్ల రూపాయలను ఆస్తులను తనఖా పెట్టి సమీకరించింది. ఇవేమీ కూడా ప్రభుత్వాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపెడేయడం లేదు. మరింతగా ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నాయి. ప్రతి నెలా రాష్ట్రానికి 3500 కోట్ల రూపాయలు జీతాల నిమిత్తం, 2500 కోట్ల పింఛన్ల నిమిత్తం మరో 3వేల కోట్లు గత బకాయిలకు వాయిదాలు, ప్రభుత్వ నిర్వహణకు అవసరమవుతున్నాయి. నెలసరి ఆదాయం ఆరువేల కోట్ల రూపాయలు మించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తూ సర్కారును నెట్టుకురావడం కత్తిమీద సాముగానే చెప్పాలి.కరోనా కారణంగా దేశవ్యాప్తంగా ఆదాయాలు పడిపోవడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పట్ల ఒకింత కరుణ చూపిందనే చెప్పాలి. అప్పులు తెచ్చుకునే పరిమితిపై చూసీ చూడనట్లుగా వ్యవహరించింది. ఆంధ్రప్రదేశ్ ఏటా స్థూల ఉత్పత్తిలో 3 శాతం రుణాలు సేకరించవచ్చు. ఈ మొత్తం 36 వేల కోట్ల వరకూ ఉంటుంది. దానిని ఇంకో శాతం వరకూ అనుమతించింది. అంటే 12 వేల కోట్ల అదనపు రుణానికి వెసులుబాటు చిక్కింది. అయితే ఏపీ మాత్రం వేరే రకాల పద్దుల ద్వారా ఈ పరిమితిని కూడా అధిగమించి 20 వేల కోట్ల వరకూ అదనపు అప్పులు తెచ్చుకుంది. అంటే ఏడాదిలో చేసిన అప్పుల మొత్తమే 68 వేల కోట్లకు మించిపోయింది.. కరోనా వెసులుబాటులు ఇకపై ఉండవు. కేంద్రం 36 వేల కోట్లకు మించి ఈ ఏడాది నుంచి అప్పులు తీసుకునేందుకు అనుమతించకపోవచ్చు. పైపెచ్చు ఎఫ్ ఆర్ బీఎం పరిధిలోకి రాకుండా కార్పొరేషన్లు, ఆస్తుల తనఖా ఇతర రూపాల్లో అప్పులు తెస్తున్న విషయం పై కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లాయి. వీటన్నిటిని పరిగణనలోకి తీసుకుని ఆంక్షలు పెట్టేందుకు అవకాశం ఉంది. దీనివల్ల వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రం చాలా క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కోబోతోందని నిపుణులు చెబుతున్నారు. కేంద్రం నిధుల విడుదలలో నియంత్రణలు , రుణ సదుపాయాలపై కోతలు పెట్టవచ్చంటున్నారు. పీకల్లోతు చిక్కుల్లో ఉన్న ఏపీ ఈ సమస్యను ఎలా ఎదుర్కోబోతోందనే ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం దొరకడం లేదు

## రఘురామ అనర్హత పిటిషన్.. స్పీకర్ ఓం బిర్లా ఆసక్తికర వ్యాఖ్యలు



ఢిల్లీ: వైసీపీ ఎంపీ రాఘురామకృష్ణరాజు అనర్హత పిటిషన్‌పై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. ఆ విషయంపై రన్నింగ్ కామెంటరీ చేయలేమని స్పీకర్ అన్నారు. అనర్హత పిటిషన్‌పై చర్యలకు ఒక ప్రక్రియ అంటూ ఉంటుందని, ఏ నిర్ణయమైనా తీసుకునే ముందు ఇరుపల వాదనలు వింటామన్నారు. సభను స్తంభింపజేస్తామని వైసీపీ ఎంపీలు చెప్పడంపై స్పందించిన స్పీకర్.. సభలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందన్నారు.ఇదిలా ఉంటే, రఘురామ అనర్హత పిటిషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను రాజ్యసభ ఎంపీ, వైసీపీ సీనియర్ నేత విజయసాయి రెడ్డి కోరిన విషయం తెలిసిందే. గత శుక్రవారం స్పీకర్‌ను కలిసిన ఆయన.. పిటిషన్ వేసి ఏడాది గడిచిందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ చర్యలు తీసుకోకుంటే పార్లమెంట్‌లో ఆందోళన చేపడతామని వ్యాఖ్యానించారు. అవసరమైతే పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామన్నారు. ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.

## అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**నందికొట్కూరు ఎస్ ఐ ఓబులేసు**

నందికొట్కూరు జూలై 12, (న్యూస్ పల్స్) అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఎస్ ఐ ఓబులేసు సోమవారం నందికొట్కూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఏర్పడ్డ ఎటువంటి పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరారు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు ఎవరు .అదేవిధంగా జరిగే అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేలా ప్రజలు సహకరించాలని ఆయన తెలియజేశారు.గ్రామాలలో సారా,మట్కా,పేకాట మరియు బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని,వారి పేర్లను గోప్యంగా ఉంచి సంఘ విద్రోహ శక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు ధైర్యంగా వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలకు తెలియజేశారు.ప్రజల సమస్యల పరిష్కరించడానికి ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎస్సై ఓబులేసు తెలియజేశారు కార్యక్రమంలో నందికొట్కూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## జస్వంత్ రెడ్డి స్ఫూర్తి తో యువత బాధ్యతగా సైన్యంలో చేరాలి

**గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ పిలుపు**

నెల్లూరు జూలై 12, (న్యూస్ పల్స్)నేటి తరానికి జశ్వంత్ రెడ్డి ఆదర్శప్రాయుడని అతనిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, యువకులు సైన్యంలో చేర్చవలసిన అవసరం ఉందని గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అరవ జయ ప్రకాష్, రాయప్ప పిలుపునిచ్చారు . స్థానిక గాంధీబొమ్మ సెంటర్ కి సమీపంలో ఉన్న స్వతంత్ర పార్కులో జస్వంత్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశ్మీర్ రాజౌరి జిల్లా సుందర్బనీ సెక్టార్లో గురువారం రాత్రి జరిగిన ఉగ్రవాద దాడిలో గుంటూరు జిల్లా బాపట్ల మండలం దారి వాడా కొత్తపాలేనికి చెందిన 23 సంవత్సరాల సైనికుడు మరుప్రోలు జశ్వంత్ రెడ్డి వీరమరణం పొందారని పేర్కొన్నారు .సందర్భంగా స్వతంత్ర్య పార్కులో సంతాప సభ ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. 17 సంవత్సరాల వయసులోనే సైన్యంలో చేరిన జశ్వంత్కు భారతదేశం ఘననివాళులు అర్పిస్తున్న ఉందని జస్వంత్ రెడ్డి త్యాగాన్ని, ధైర్యాన్ని, దేశం పట్ల ఆయనకున్న ప్రేమను కొనియాడారు. కొడుకును సైన్యంలోకి పంపిన అతని తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్నామని వారన్నారు .నలందా విశ్వవిద్యాలయం, అయోధ్య కేదార్నాథ్ ఎన్ని దేవాలయాలు ధ్వంసమైన దాదాపు వెయ్యి సంవత్సరాలు దండయాత్రలు కొనసాగిన భారతదేశ సంస్కృతిని ఛిన్నాభిన్నం చెయ్యలేక ప్రస్తుతం దొంగచాటు దాడులు నిర్వహిస్తున్న ఉగ్రవాదులకు సరైన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు . తమ బిడ్డలను తల్లిదండ్రులు డాక్టర్లు, యాక్టర్లు, నాయకులు, వ్యాపారస్తులు కావాలనే తరుణంలో తన కుమారుడిని దేశ రక్షణ కోసం సైన్యంలోకి పంపిన జస్వంత్ రెడ్డి తల్లిదండ్రుల లక్ష్యానికి యువతరం కట్టుబడి ఉండాలని కోరారు. జస్వంత్ రెడ్డి స్ఫూర్తితో యువత సైన్యంలో చేరాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ కుటుంబానికి 50 లక్షల ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సతీష్, కొలపర్తి హజరత్, కొల్లపాక సురేష్, జి. వి నరసింహారావు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఐ రౌండ్‌టేబుల్ సమావేశం



విశాఖ:జూలై 12, (న్యూస్ పల్స్) విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సీపీఐ రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది. జులై నెలాఖరున భారీగా ఉద్యమాలు, నిరసనలు చేపట్టాలని తీర్మానం చేసింది. 150 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదని సీపీఐ రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పరం చేయడంలేదని సోమువీర్రాజు ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఇకపై సీఎం జగన్ కూడా నిరసనల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## వాహనాలపై పెండింగ్ చలానాలు చెల్లించాలి

**- ట్రాఫిక్ ఎస్సై కమలాకర్**

పెద్దపల్లి జూలై 12వాహనాలపై పెండింగ్ చలానాలు ఉన్నట్లయితే వెంటనే చెల్లించాలని, లేనట్లయితే ప్రత్యేక తనిఖీలలో వాహనాన్ని స్వాదినపరుచుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. సోమవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి గోదావరిఖని పట్టణంలోని రాజేష్ థియేటర్ వద్ద చలానాలు ఎక్కువగా ఉన్న వాహనాల మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెండింగ్ చలానాలు ఎక్కువగా ఉన్న వాహనాలను ఆపి చలానాలు చెల్లించిన తర్వాత వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురుంచి అవగాహన కల్పించి వదిలిపెట్టారు. చలానాలు చెల్లించని వాహనాలను స్వాధీన పరుచుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలపై పెండింగ్ చలానాలను మీ సేవ, నెట్ బ్యాంకింగ్, పేటియం ద్వారా వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ చలానాలకు, ప్రమాదాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలలో ఏఎస్సై సురేష్, కానిస్టేబుల్స్ భార్గవ్, లక్ష్మణ్, హోంగార్డ్ మహేందర్ పాల్గొన్నారు.

## వేద విజ్ఞాన ఫలాలను సమాజానికి అందించాలి

**టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి**
**ఎస్వీ వేద విశ్వవిద్యాలయం 15వ ఆవిర్భావ దినోత్సవం**

తిరుపతి జూలై 12, శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో పరిశోధనలను విస్తృతం చేసి వేదాల్లోని విజ్ఞానాన్ని సమాజానికి అందించాలని టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి కోరారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 15వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం వర్సిటీ పరిపాలనా భవనంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు ఈవో మాట్లాడుతూ వేదవిద్య క్లిష్టమైనదని, విద్యార్థులు ఎంతో సాధన చేస్తేగానీ ఇందులో రాణించలేరని చెప్పారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడే వేదవిద్యను బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులు వేద విద్యను పరిపూర్ణంగా సాధన చేసి మంచి భాషతో ప్రవచనాలిచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల చేత వారానికోసారి ప్రసంగాలు ఇప్పించి సాధన చేయించాలన్నారు. పూర్వకాలంలో వేదాల్లో 1331 శాఖలుండేవని, దేశంలోని పాలనా పరిస్థితుల కారణంగా చాలాకాలం పాటు భారతీయులు వాటికి దూరమయ్యారని అన్నారు. ప్రస్తుతం 9 వేద శాఖలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, వీటిలో దాగి ఉన్న సైన్స్ రహస్యాలను వెలికితీయాలని కోరారు. సూర్యమండలం, నవగ్రహాలు, భూగోళం లాంటి అంశాలను శాస్త్రవేత్తలు మనకు తెలుపకముందే వేదాల్లో ఉన్నాయన్నారు. వేదశాఖల్లోని అన్ని మంత్రాలను అర్థతాత్పర్యాలతో సరళమైన వ్యవహారిక భాషలో అందించాలని కోరారు. ఎస్వీబీసీలో వేదాల వ్యాప్తికి ప్రాముఖ్యత ఇస్తున్నామని, ఇప్పటివరకు ప్రసారమైన యోగవాశిష్టం-విషూచిక మహామంత్ర పారాయణం, సుందరకాండ, విరాటపర్వం, గీతాపారాయణం కార్యక్రమాలకు భక్తుల నుండి విశేషస్పందన లభించిందన్నారు. వర్సిటీ పండితులు ముందుకొస్తే వారి ప్రవచనాలను ఎస్వీబీసీ ద్వారా ప్రసారం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సన్నిధానం సుదర్శనశర్మ మాట్లాడుతూ వర్సిటీ ఆవిర్భావం, ప్రస్థానం గురించి తెలియజేశారు. వేదాలను పరిపూర్ణంగా అర్థం చేసుకుని, పారాయణం చేసి, వేదభాష్యం చెప్పగలిగే పండితులను వర్సిటీ తయారు చేస్తోందన్నారు. వేదపండితులకు సముచితమైన గౌరవం, అవకాశాలు లభించేందుకు వీలుగా కంప్యూటర్, గణితం, ఆంగ్లం ప్రవేశపెట్టినట్టు చెప్పారు. డిగ్రీస్థాయిలో వేదగణితం, వేదిక్ ఫిజిక్స్, సంస్కృతంలో డిగ్రీ, పిజి కోర్సులు, జర్మన్ భాషలో సర్టిఫికేట్ కోర్సులు ఇటీవల ప్రవేశపెట్టామన్నారు. వేదాలను పరిశోధించి, ప్రచురించడం ద్వారా వేదాల్లోని మంచి విషయాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు.ఇరామానుశనూట్రన్దాది పుస్తకం, వర్సిటీ న్యూస్‌లెటర్ ఆవిష్కరణ వర్సిటీలోని పరిశోధన మరియు ప్రచురణల విభాగం ముద్రించిన ఇరామానుశనూట్రన్దాది అనే పుస్తకాన్ని, వేదసురభి పేరుతో న్యూస్‌లెటర్‌ను అదనపు ఈవో ఆవిష్కరించారు. ఇరామానుశనూట్రన్దాది(ప్రబంధరక్షా వ్యాఖ్యానువాద సహితం) అనే పుస్తకం నాళాయిర దివ్యప్రబంధంలోని పాశురాలకు వ్యాఖ్యానం. టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు విశ్రాంత ప్రత్యేకాధికారి శ్రీ శింగరాచార్యులు ఈ ప్రబంధ రక్షా తమిళ వ్యాఖ్యానాన్ని యథాతథంగా తెలుగులోకి అనువదించారు.శాస్త్రోక్తంగా సుదర్శన హోమం వర్సిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వర్సిటీ అభివృద్ధి, లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ఉదయం యాగశాలలో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం, నవగ్రహ హోమం, నవగ్రహ పూజ నిర్వహించారు. ఆచార్య శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, ఉపకులపతి ఆచార్య సన్నిధానం సుదర్శనశర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కసాయి తండ్రి

**ఉండి మండలం చెరుకువాడ లో దారుణం**

ఏలూరు జూలై 12, (న్యూస్ పల్స్) పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. తొమ్మిది నెలల కన్న కొడుకు నందకిషోర్ ను తండ్రి నారాయణ ఆడిఇస్తున్నట్లు నటిస్తూ చిన్న చేపను నోట్లో పెట్టడంతో ఊపిరాడక చనిపోయాడు ఆ బాలుడు, తనపై అనుమానంతోనే తన భర్త తన కొడుకును చంపిస్తాడని ఆరోపిస్తున్న బాలుడి తల్లి అనుమానంతో ప్రతిసారి తనను, తన కుమారుని కొట్టేవాడిని భార్య సుధారాణి బోరున విలపిస్తుంది . మనమిద్దరం నల్లగా ఉండగా పుట్టిన కొడుకు ఎందుకు తెల్లగా ఉన్నాడంటూ అనుమానంతో తనని హింసించే వాడని బాలుడి తల్లి సుధారాణి కన్నీటి పర్యంతమైంది, అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 3 వ రోజుకు చేరిన యానాదులు గిరిజనుల ధర్నా

**ఐటీడీఏ పీవో పై విచారించి చర్యలు చేపడతామన్న కలెక్టరేట్ ఏవో**

నెల్లూరు జూలై 12, (న్యూస్ పల్స్) ఐటిడిఎ పిఓ పై చట్టరీత్య తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట యానాదులు గిరిజన నాయకులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం సోమవారం తో 3వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో కలెక్టర్ కార్యాలయం లోకి చొచ్చుకు పోయేందుకు ఆందోళన కారులు ప్రయత్నించారు. వీరి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఉద్రిక్తత గమనించిన కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంబంధిత ఆందోళన దారులతో చర్చించిన కలెక్టరేట్ ఎఓ, ఐటిడిఎ పిఓ పై విచారణ జరిపి చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకునేందుకు కలెక్టర్తో మాట్లాడదామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యానాదుల గిరిజన నాయకులు మాట్లాడుతూ ఐటీడీఏ పీవో పై అధికారిక చర్యలు తీసుకునే వరకూ దీక్షలు కొసాగుతాయని ఎఓ కి స్పష్ణం చేయడమైనది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య, జిల్లా అధ్యక్షులు బి ఎల్ శేఖర్, ప్రధాన కార్యదర్శి రాపూరు కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్లరవి, కోశాధికారి సుబ్రమణ్యం, మహిళానాయకులు లక్ష్మి, సునంద, రవణమ్మ, జ్యోతి, యువజన విభాగం నాయకులు రమేష్, లక్ష్మణ్, చెంచురామయ్య, మురళీ, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏకోల్లు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులకు కొమ్ము కాస్తే, ఆదివాసి ద్రోహులుగా మిగిలి పోతారు

**మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్**
**ఈరోజు దీక్షలో మద్దతుగా తెలుగుదేశం బిజెపి**

విశాఖపట్నం జిల్లా అవినీతి అధికారులను కొమ్ము కాస్తే ఆదివాసి ద్రోహులుగా మిగిలిపోతారని ×మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు.హుకుంపేట దీక్షలో ఆయన మాట్లాడుతూ: ఆదివాసి ప్రాంతంలో అవినీతి అధికారులకు కొమ్ము కాస్తున్న ఎమ్మెల్యేలు ,ఎంపీలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని , ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తే ఈ ప్రభుత్వం బస్మం అవటం ఖాయమని అన్నారు. ఆదివాసుల సంక్షేమానికి చూడవలసిన మీరు ఆదివాసుల పై దాడులు సరికాదని ఇప్పటికైనా హుకుంపేట లో జరిగిన విషయం పై అరుకు ఎమ్మెల్యే ఎంపీలు మౌనం వీడాలని అన్నారు. ఆదివాసి మహిళకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని ప్రత్యక్ష పోరాటంలో కూడా ముందుంటానని వారన్నారు .బిజెపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు పాంగి రాజా రావు మాట్లాడుతూ: హుకుంపేట లో ఆదివాసి మహిళ పట్టా భూమి, కరెంటు మీటర్, ఇంటి పన్ను, సర్వ హక్కులు కలిగి ఉన్న ఆదివాసి మహిళా షాపుని హుకుంపేట మండల తాహసిల్దార్, వై వి కోటేశ్వరరావు మరియు విఆర్ఓ మీసాల సింహాచలం రెండు లక్షల రూపాయలు లంచం ఇవ్వలేదని అక్కసుతో ఆగమేఘాల మీద వెళ్లి సూర్య మణి గోపాల్ను నాలుగు గంటలు పోలీస్ స్టేషన్లో నిర్బంధించి షాపు కూల్చిన అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.గత 17 రోజుల నుండి బాధితులు రోడ్డుమీద పచ్చి ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ తమకు న్యాయం చేయమని ప్రాధేయ పడుతున్నా కూడా కనీసం పట్టించుకోకపోవడం ఇంతకీ అరకు ఎమ్మెల్యే, ఎంపీలు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తున్నారో ఇంతకీ ఈ ప్రభుత్వాం రాష్ట్రంలో ఉందా ..లేదో కూడా తెలియని పరిస్థితుల్లో ఉందని ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తే రానున్న రోజుల్లో ప్రజలే తిరుగుబాటు చేసే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లో సెంట్రల్ సెన్సార్ మెంబర్ సల్ల రామకృష్ణ, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు సరభ వేమన బాబు, సీనియర్ నాయకులు రాజారావు మేండా రమణ , బిజెపి మండల అధ్యక్షుడు గాసన్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తులసీరావు, సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణుడు, సర్పంచ్ల ఫోరం నాయకులు బాలురు వెంకటరమణ, సత్యనారాయణ ,పాంగి పాండురంగ స్వామి సుమన్ కామేశ్వరరావు శ్యామ్ కృష్ణారావు కోటి, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, సిపిఎం పార్టీ మండల నాయకులు సుడిపల్లి కొండలరావు, మహిళా నేతలు కంబిడి లిత కుమారి, రుడి రవణమ్మ, కే సరస్వతి, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన నూతన ఎస్పీ విజయరావు

నెల్లూరు జూలై 12, (న్యూస్ పల్స్)జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ను, జిల్లా ఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించిన విజయ రావు పుష్పగుచ్ఛం తో మర్యాదపూర్వకంగా లాంఛనంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు ఎస్పీగా బదిలీ చేసిన రాష్ట్ర పోలీసు శాఖ, ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గత సంవత్సర పైసలకు కంటికి కనిపించని కరోనా వైరస్ నేపథ్యంలో ఫ్రంట్లైన్ వారియర్స్ గా విధి నిర్వహణలో ఉన్న అనేక మంది పోలీసులు మరణించడం బాధాకరం అన్నారు. ముఖ్యంగా పోలీస్ వెల్ఫేర్ కు తన వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో శాంతిభద్రతల నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ అధికారులు, ప్రజా సంఘాలు, సమాజం పట్ల గౌరవ మర్యాదలు ఉన్న అందరితోనూ కలిసికట్టుగా ఫ్రెండ్లీ పోలీస్ టీం ఏర్పాటుతో శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుండి ఎస్ పి వరకు ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నెరవేరుస్తూ, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు ఒక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెడతామన్నారు. యాక్సిడెంట్ మరణాలు తగ్గించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల భద్రత రక్షణ కై దిశ యాప్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాల్సిందిగా సూచించారు. శాఖాపరమైన సమావేశాల తో పాటు, క్రైమ్ మీటింగ్ ఏర్పాటు చేసి, జుడిషియల్ అధికారుల కోఆర్డినేషన్ తీసుకుంటామన్నారు.

# తర్వలో అధునిక హంగులతో భవానీపురం స్టేడియం నిర్మాణం

అమరావతి జూలై 12, (న్యూస్ పల్స్) గత పాలకులు నిధులు కెటాయించకుండా అభివృద్ధి అంటూ ప్రచారంతో కాలక్షేపం చేశారని, జగనన్న హయంలో విజయవాడను ఐకాన్‌గా అధునిక హంగులతో భవానీపురం స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తామని దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సొమవారం అధికారులతో కలిసి మంత్రి నగరంలో పలు ప్రాంతాలను పర్యటించారు. 44వ డివిజన్ లో చెరువు సెంటరు, లేబర్ కాలనీ, యద్దనపూడి వారి వీధి, మొఘల్ వారి వీధి, అప్పలస్వామి క్వారీ మీదుగు నాలుగు స్తంభాల సెంటరు తదితర ప్రాంతాలను పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు..పశ్చిమ నియోజకవర్గం కొండ ప్రాంతంలో తాగునీరు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. 44వ డివిజన్ కొండ ప్రాంతంలో తాగునీరు ఇబ్బందులు పరిష్కారంలో భాగంగా బూష్టర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో కామకోటినగర్, మువ్వలవీధి, యద్దనపూడి వారివీధి, మొఘల్ వారి వీధి, అప్పలస్వామి క్వారీ తదితర ప్రాంతాలకు తాగునీరు సమస్య తీరుతుందన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజి పారుదలకు, అదే విధంగా రోడ్డుపై వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేబర్ కాలనీలో శిథిలమైన ఆరు బిల్డింగ్ లో ఉంటున్నవారు వారి సమస్య పరిష్కారించాలని మంత్రిని కోరడంతో వారికి వేరోక చోట స్థలంగాని లేదా వారికి భవనం

**కొండ ప్రాంతంలో తాగునీరు సమస్యలేకుండా చర్యలు చేపట్టాలి**

**లేబర్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కారిస్తాం**

**దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**

నిర్మించి ఇచ్చేందుకు గల సాధ్యసాధాలను పరిశీలించి, అంచనాలు తయారు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు మంత్రి ఫోన్ లో సూచించడం జరిగింది. అదే విధంగా భవానీపురం స్టేడియం స్థలాని మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు.. పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేడియం నిర్మాణం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావలన్నారు. క్రీడాకారులు బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ వంటి పలు రకాల ఆటలు విడివిడిగా అందుబాటులో విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆధునిక హంగులతో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇటివల కరోనాతో మృతి చెందిన బి. సునీల్ కుటుంబ సభ్యలను మంత్రి పరామర్శించారు.. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి కుటుంబ సభ్యలను మంత్రి 20 వేల రూపాయల నగదును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో 44 వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్న కుమారి గారు నగర పాలక సంస్థ అధికారులు, వైసీపీ శ్రేణులు ఉన్నారు.

# గుంటూరు జిల్లాల్లో రేవ్ పార్టీ కల్చర్

గుంటూరు, జూలై 12, (న్యూస్ పల్స్)జిల్లాలో రేవ్ పార్టీ సంస్కృతి క్రమంగా పెరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి హోటళ్లు, ప్రైవేటు అతిథి గృహాల్లో వ్యభిచారానికి పాల్పడుతున్నారు. పోలీసులు నిఘా పెడుతున్నా ఇలాంటి ఘటనలు తరుచూ చోటుచేసుకోవడం అందరినీ కలవరపెడుతోంది. నెలరోజుల క్రితం గుంటూరు అరండల్‌పేటలో ఓ హోటల్‌లో విత్తన కంపెనీ డీలర్ ఒకరు తన పుట్టిన రోజు వేడుకలకు బెంగళూరు నుంచి యువతులను రప్పించాడు. వారితో కలిసి పార్టీ చేసుకుంటుండగా పోలీసులు పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.ఆ ఘటన మరిచిపోకుండానే 3 రోజుల క్రితం క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అధికార పార్టీకి చెందిన నాయకుడొకరు తన పుట్టిన రోజును పురస్కరించుకుని భారీ రేవ్ పార్టీ నిర్వహించారు. దీనికి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అర్ధనగ్నంగా ఉన్న యువతులతో నేతలు డ్యాన్సులు చేస్తున్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు దారితీసింది. గతంలో సత్తెనపల్లిలో వైసీపీ నేత ఒకరు తన పుట్టినరోజుకు వావిలాల ఘాట్‌ను వేదికగా చేసుకున్నారు. ఆ సందర్భంగా అక్కడ రికార్డింగ్ డ్యాన్సులు వేయించడం విమర్శలకు దారితీసింది.అమ్మాయిలతో చిందులేస్తున్న వైసీపీ నేతలురాష్ట్రంలో అమలవుతున్న కోవిడ్ నిబంధనలను అధికార పార్టీ నేతలే ఉల్లంఘించి వేడుకలు నిర్వహించడం, దానికోసం బయటి ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకురావడం వంటి ఘటనలు పోలీసుల ఉదాసీన వైఖరికి అద్దం పడుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మొత్తానికి జిల్లాలో కొందరు రాజకీయ నాయకులు, మరికొందరు వ్యాపారులు కరోనా కాలంలోనూ పోలీసుల కళ్లు గప్పి రేవ్ పార్టీలు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. ఒకేచోట ఎక్కువ మంది జనాలు గుమిగూడటం, భౌతికదూరం పాటించకపోవడం వల్లే కరోనా వ్యాప్తి చెందుతుందని వైద్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నా క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వైకాపా నేతలు రేవ్ పార్టీ నిర్వహిస్తుంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోందిమరోవైపు క్రోసూరు ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో చూసిన గుంటూరు రూరల్ ఎస్పీ విశాల్‌గున్నీ బాధ్యులైన వ్యక్తులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక పోలీసులు అప్పుడు రంగంలోకి దిగి రేవ్ పార్టీ నిర్వహించిన ఇద్దరు వైసీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. ఎస్పీ స్పందించే వరకు స్థానిక పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టకపోతే యువత పక్కదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.చిలకలూరిపేటకు చెందిన అధికార పార్టీ నాయకుడొకరు మూడు రోజుల క్రితం చీరాల వద్ద ఓ రిసార్ట్స్‌లో ఇలానే రేవ్ పార్టీ నిర్వహిస్తుండగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి తాను అధికార పార్టీ నాయకుడినని, తనకు నామినేటెడ్ పదవి ఉందని, తననే పట్టుకుంటారా అంటూ పోలీసులపై చిందులు తొక్కాడు. అయినా పోలీసులు అతన్ని వదలకపోవడంతో ఓ ప్రజాప్రతినిధి బంధువు అక్కడి పోలీసులకు నచ్చజెప్పి విడిపించుకుని వెళ్లినట్లు చిలకలూరిపేట ప్రజలు చర్చించుకుంటున్నారు.

**తెలంగాణలో కడుతున్న అక్రమ ప్రాజెక్ట్ లను వెంటనే ఆపివేయాలి**

**కృష్ణా నీటి జలలలో రాయలసీమ వాటలపై కేంద్ర బిజేపి ప్రభుత్వ నిర్ణయన్ని తెలపాలి**

నంద్యాల తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల నీటి వాటాల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. కృష్ణా రివర్ బోర్డ్ ను కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు వినతిపత్రం అందజేసిన రాయలసీమ విద్యార్థి,యువజన సంఘల జేఏసీ జిల్లా కన్వీనర్ వంకిరి.రామచంద్రుడు,కో కన్వీనర్ షేక్.రియాజ్. స్థానిక నంద్యాల పట్టణంలో బీజేపీ పార్టీ కార్యక్రమాలకు వచ్చిన మాజీమంత్రి,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెల కిషోర్ బాబు రాయలసీమ విద్యార్థి యువజన సంఘల జేఏసీ జిల్లా కన్వీనర్ వంకిరి.రామచంద్రుడు,కో కన్వీనర్ షేక్.రియాజ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా నది,శ్రీశైలం నీటి వాటలలో రాయలసీమ ప్రాంతం నీటి వాటాలను తేల్చలని,తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల శ్రీశైలం నీటి కేటాయింపులలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తెలంగాణ ప్రభుత్వం కడుతున్న అక్రమ ప్రాజెక్ట్ లను వెంటనే తొలగించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని.కృష్ణా రివర్ బోర్డ్ ను కర్నూలులో ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం అందజేశారు

# వీటిని ఒక నెల రోజుల పాటు అలవాటు చేసుకుంటే జుట్టు బాగా పెరుగుతుంది



మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో జుట్టు ఆరోగ్యం చాలా ముఖ్యమైన అంశం. జుట్టు ఆరోగ్యం కూడా ఇందులో పెద్ద పాత్ర పోషిస్తుంది. ప్రతి ఒక్కరూ కోరుకునేది మంచి జుట్టు. అందువల్ల, ఈ సమస్యలను పరిష్కరించడానికి ఏమి చేయాలో చాలా మందికి తెలియదు. జుట్టు ఆరోగ్యం మరియు బలం కోసం మీరు తెలుసుకోవలసిన కొన్ని విషయాలు ఇక్కడ ఉన్నాయి. జుట్టు ఆరోగ్య విషయంలో పోషకాహారం కూడా ముఖ్యం. కొన్ని ఆహారాలు మీ ఆరోగ్యం మరియు బలానికి చాలా సవాలుగా ఉంటాయి. కానీ తరచుగా జుట్టు ఆరోగ్యం అనేక విధాలుగా సంక్షోభంలో ఉంటుంది. వీాది ఎంచుకునేటప్పుడు తెలుసుకోవల్సిన కొన్ని విషయాలు ఇక్కడ ఉన్నాయి. కొన్ని ఆహారాలు జుట్టు ఆరోగ్యం మరియు పెరుగుదలకు సహాయపడతాయి. ఇవన్నీ మనం ఒక నెలపాటు అలవాటు చేసుకుంటే జుట్టు బాగా పెరుగుతుంది.చేపలు చేపలు చేపలు ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ చేపలు ఆరోగ్యకరమైన ఆహారాలలో ఒకటి. ఇందులో కొవ్వు ఆమ్లాలు చాలా ఉన్నాయి. ఇవన్నీ మీ జుట్టు ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయి. సాల్మన్, మాకేరెల్ మరియు ట్యూనా అన్నీ మీ ఆరోగ్యానికి మంచివి. ఇందులో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. చేపలు తినని వ్యక్తులలో కూడా, మీరు ఇలాంటి వాటి అలవాటు చేసుకుంటే, అది మీ ఆరోగ్యానికి మంచిది, జుట్టు పెరుగుదలకు కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మీకు జుట్టు రాలే సమస్య ఉందా? సులభమైన పరిష్కారం ఈ హెయిర్ మాస్కేమీకు జుట్టు రాలే సమస్య ఉందా? సులభమైన పరిష్కారం ఈ హెయిర్ మాస్కే ఎండిన పండ్లు ఎండిన పండ్లు ఎండిన పండ్లను తినడం కూడా మీ ఆరోగ్యానికి చాలా సహాయపడుతుంది. అందువల్ల, ఇలాంటి వాటిపై మనం శ్రద్ధ వహిస్తే, మన జుట్టు ఆరోగ్యం కూడా బాగుపడుతుంది. ఇందులో ప్రోటీన్ మరియు జింక్ చాలా ఉన్నాయి. కాబట్టి, జుట్టు ఆరోగ్యానికి ఇది చాలా సహాయపడుతుంది. వాల్నట్ మరియు బాదంపప్పులో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ఇది మీ ఆరోగ్యానికి చాలా సహాయపడుతుంది. ఇది జుట్టుని బలపరుస్తుంది. ఇది జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మరియు తద్వారా జుట్టు పెరుగుదలను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది. జుట్టు పెరగడం లేదా? మీరు చేసే ఈ తప్పులే దానికి కారణం ..జుట్టు పెరగడం లేదా? మీరు చేసే ఈ తప్పులే దానికి కారణం .. అవోకాడో అవోకాడో అవోకాడోను మీ డైట్‌లో చేర్చడం ఎందుకు మంచిది? ఇది చాలా ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. అవోకాడో ఆరోగ్యానికి మాత్రమే కాకుండా జుట్టు బలానికి కూడా మంచిది. ఇందులో ఉన్న అన్ని విటమిన్ ఇ మరియు కొవ్వు ఆమ్లాలు మీ ఆరోగ్యానికి చాలా మంచివని చెప్పడంలో సందేహం లేదు. ఇది మన ఆరోగ్యానికి తరచుగా జుట్టుకు దోహదం చేస్తుంది. అవోకాడోలోని యాంటీఆక్సిడెంట్లు మీ తలలోని చర్మంలో కలసిపోతాయి. ఇది మీ జుట్టు విరగకుండా కాపాడుతుంది. మీకు జుట్టు ఊడుతుందా? జుట్టు సాంద్రత తగ్గుతుందా? దీన్ని నివారించడానికి మార్గాలు ఇక్కడ ఉన్నాయి!మీకు జుట్టు ఊడుతుందా? జుట్టు సాంద్రత తగ్గుతుందా? దీన్ని నివారించడానికి మార్గాలు ఇక్కడ ఉన్నాయి! చిక్పీస్ చిక్పీస్ చిక్పీస్ ఆరోగ్యానికి గొప్పవి. ఇది జుట్టు సంరక్షణకు కూడా మంచిదని చెప్పడంలో సందేహం లేదు. గ్రీన్ బీన్స్ లో ఇనుము అధికంగా ఉంటుంది. ఈ విధంగా కణాలు పునరుత్పత్తి చెందుతాయి మరియు జుట్టు తిరిగి పెరుగుతుంది. ఇందులో ప్రోటీన్, పొటాషియం, మెగ్నీషియం మరియు విటమిన్ బి కూడా ఉన్నాయి. అన్ని అత్యంత అవసరమైన ఖనిజాలు ఉండటం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడతాయి. తలలో రక్త ప్రసరణ మెరుగుపరచడానికి చిక్పీస్ అలవాటు చేసుకోవడం మంచిది. చిలగడదుంప చిలగడదుంప చిలగడదుంపలు తినడం కూడా అలవాటు చేసుకోవాలి. జుట్టు పెరుగుదల మరియు ఆరోగ్యాన్ని వేగవంతం చేయడానికి ఇది చాలా సహాయపడుతుంది. ఇది మీ జుట్టు రాలడాన్ని తొలగించడానికి మరియు జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అదనంగా, తీపి బంగాళాదుంప వ్యాధిని తొలగించడం ద్వారా జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి ఉత్తమమైన మార్గాలలో ఒకటి. మీరు ప్రతిరోజూ దీనిని అలవాటు చేసుకుంటే, మీరు ఒక నెలలో మార్పులు చేయవచ్చు. ఈ రకమైన విషయాలు మీకు చాలా సహాయపడతాయి. గుడ్లు గుడ్లు గుడ్లలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. జుట్టు పెరుగుదల మరియు మంచి బలం మరియు నల్ల జుట్టు పెరుగుదలకు గుడ్లు గొప్పవి. వీటిని తినడం వల్ల జుట్టు రాలకుండా సహాయపడుతుంది మరియు మంచి జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇలాంటి వాటిపై శ్రద్ధ పెట్టడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు చాలా గొప్పవి. అటువంటి మార్పులను మీరు త్వరగా గమనించవచ్చు. కానీ ఒక నెల పాటు నిరంతరం గుడ్లు తినేటప్పుడు గమనించవలసిన ఏకైక విషయం ఏమిటంటే గుడ్డు సొనలు తినేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. ఇది మీ ఆరోగ్యాన్ని కొద్దిగా కష్టతరం చేస్తుంది.

# జోకోవిచ్ 25 గ్రాండ్‌స్లామ్‌లు గెలుస్తాడు..

లండన్: టెన్నిస్ స్టార్ నోవాక్ జోకోవిచ్ తాజాగా వింబుల్డన్ నెగ్గి తన ఖాతాలో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను వేసుకున్న విషయం తెలిసిందే. జోకోవిచ్‌పై టెన్నిస్ లెజెండ్ జాన్ మెకన్రో లేటెస్ట్‌గా ఓ కామెంట్ చేశారు. ఒకవేళ జోకోవిచ్ 25 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలవకుంటే ఆశ్చర్యమే అవుతుందని మెకన్రో అన్నారు. రోజర్ ఫెదరర్, రఫేల్ నాదల్ ఖాతాల్లో కూడా 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఉన్న విషయం తెలిసిందే. జోకోవిచ్ ఆట తీరు మరింత పరిణితి చెందిందని మెకన్రో అన్నారు. కనీసం మరో నాలుగు లేదా అయిదు గ్రాండ్‌స్లామ్‌లు అతను గెలిచే ఛాన్సు ఉందని అన్నారు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్‌తో పాటు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ను అతను గెలిచాడు. జోకోవిచ్ చరిత్ర సృష్టించే దిశలో వెళుతున్నాడని, తీవ్రమైన వత్తిడిని



ఎదుర్కొని ముందుకు సాగుతున్నాడని మెకన్రో అన్నారు. 2013 నుంచి 2016 మధ్య జోకోవిచ్‌కు బోరిస్ బేకర్ కోచ్‌గా ఉన్నాడు. ఆ సమయంలో ఆరు టైటిళ్లను జోకో గెలిచాడు. ప్రస్తుతం వింబుల్డన్ మాజీ చాంపియన్ ఇవానిసెవిక్ ఆధ్వర్యంలో జోకో శిక్షణ జరుగుతున్నది.


# మరోసారి ఇంకో హీరోతో ఎన్టీఆర్ స్క్రీన్ షేర్?



ఎన్టీఆర్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో ఆర్ ఆర్ ఆర్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చింది. ఆర్ ఆర్ ఆర్ లో ఎన్టీఆర్ మరో యంగ్ స్టార్ రామ్ చరణ్ తో స్కీన్ షేర్ చేసుకుంటూ ఉన్న విషయం తెల్సిందే. రామ్ చరణ్ తోనే కాకుండా అంతకు ముందు ఎన్టీఆర్ తన సినిమాల్లో పలువురు హీరోలతో స్కీన్ షేర్ చేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా లో పలువురు హీరోలు విలన్ గా లేదా క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటించిన దాఖలాలు చాలా ఉన్నాయి. మరో సారి ఎన్టీఆర్ మరో యంగ్ హీరోతో స్కీన్ షేర్ చేసుకుంటాడనే వార్తలు వస్తున్నాయి.ఆర్ ఆర్ ఆర్ సినిమా తర్వాత ఎన్టీఆర్ చేయబోతున్న సినిమా కు కొరటాల శివ దర్శకత్వం వహించబోతున్నాడు. ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చిన ఆ సినిమా కథ అనుసారం ఒక యంగ్ హీరో సినిమాలో నటించాల్సి ఉందట. ఆ పాత్ర కోసం టాలీవుడ్ లేదా కోలీవుడ్ యంగ్ నోటెడ్ హీరోను ఎంపిక చేస్తారనే వార్తలు వస్తున్నాయి. గతంలో ఎన్టీఆర్.. కొరటాల శివల కాంబినేషన్ లో వచ్చిన జనతా గ్యారేజీ చిత్రంలో మలయాళ స్టార్ మోహన్ లాల్ నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా తర్వాత మళ్లీ వీరి కాంబోలో రాబోతున్న ఈ సినిమాలో యంగ్ హీరోను తీసుకు రాబోతున్నారట.విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం పాన్ ఇండియా మూవీగా ఎన్టీఆర్.. కొరటాల శివల కాంబోలో రూపొందబోతున్న సినిమాలో ఆ పాత్రను బాలీవుడ్ నటుడితో చేయించినా ఆశ్చర్యం లేదు. ప్రస్తుతానికి ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే విషయమై క్లారిటీ లేదు. కాని ప్రస్తుతం సినిమాకు సంబంధించిన నటీ నటుల ఎంపిక జరుగుతుంది. త్వరలోనే ఆ పాత్ర కోసం ఎవరిని ఎంపిక చేస్తారు అనేది క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. షూటింగ్ ప్రారంభం అయ్యే సమయానికి సినిమాలో నటించబోతున్న యువ నటుడు ఎవరు అనే విషయాన్ని క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది.


# మన ఫైటర్ హాలీవుడ్ రేంజ్ యాక్షన్ సీన్స్

బాలీవుడ్ లో సినిమాల మేకింగ్ బడ్జెట్ భారీగా పెరిగి పోతుంది. సౌత్ లోనే భారీ బడ్జెట్ సినిమాలు రూపొందుతున్నప్పుడు మేమేమి తక్కువ కాదు అన్నట్లుగా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ కూడా వందల కోట్ల బడ్జెట్ ను పోసి భారీ సినిమాలను తెరకెక్కిస్తున్నారు. హాలీవుడ్ సినిమాల రేంజ్ లో తమ సినిమాలను నిలిపేందుకు చాలా మంది హిందీ సినిమాల దర్శక నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు.అందులో భాగంగా హృతిక్ రోషన్ నటించబోతున్న ఫైటర్ సినిమా లో హాలీవుడ్ రేంజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇప్పటి వరకు ఇండియన్ స్కీన్ పై ఎప్పుడు చూడని యాక్షన్ సన్నివేశాలను ఈ సినిమాలో హృతిక్ రోషన్ తో దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ చూపించబోతున్నట్లుగా టాక్ వినిపిస్తుంది.బాలీవుడ్ లో పలు యాక్షన్ సినిమాలను తెరకెక్కించి సూపర్ హిట్స్ ను దక్కించుకున్న సిద్దార్థ్ ఆనంద్ ప్రస్తుతం షారుఖ్ ఖాన్ తో పఠాన్ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. కరోనా వల్ల ఆలస్యం అవుతున్న ఆ సినిమా గ్యాప్ లో హృతిక్ రోషన్ తో సినిమా ను గురించిన చర్చలు జరుపుతున్నాడు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో పఠాన్ కు గుమ్మడి కాయ కొట్టిన వెంటనే ఫైటర్ ను మొదలు పెట్టాలని దర్శకుడు భావిస్తున్నాడట. ఇక బాలీవుడ్ మీడియా సర్కిల్స్ నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఉండే ఆకాశయాన అద్బుత ఫైటింగ్స్ ప్రేక్షకుల ఒల్లు గగుర్లు పొడిచేలా ఉంటాయని అంటున్నారు.హాలీవుడ్ టెక్నాలజీని మరియు టెక్నీషియన్స్ ను ఈ సినిమా కోసం అందుబాటులోకి తీసుకు వచ్చిన మేకర్స్ ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారట.



అద్బుతమైన యాక్షన్ సన్నివేశాలతో పాటు మొట్ట మొదటి సారి హృతిక్ రోషన్ మరియు దీపిక పదుకునే లు రొమాన్స్ చేయబోతున్న నేపథ్యంలో అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి.యాక్షన్ సినిమా లకు బ్రాండ్ అంబాసిడర్ గా ఇప్పటికే నిలిచిన హృతిక్ రోషన్ ఈ ఫైటర్ తో హాలీవుడ్ ప్రేక్షకులకు మరింత చేరువ అవ్వడం ఖాయం అంటున్నారు. ఈ సినిమా తర్వాత హాలీవుడ్ లో మన యాక్షన్ సినిమా ల స్టామినా తెలుస్తుందని నిపుణులు అంటున్నారు. హాలీవుడ్ ప్రేక్షకులు కూడా మన సినిమాను చూసేందుకు ఆసక్తి చూపించేలా హృతిక్ రోషన్ దీపిక పదుకునే ఫైటర్ మూవీ ఉంటుందని అంటున్నారు.

# మిల్కీలోని కవయిత్రి అలా బయటికొస్తోంది!



కథానాయికల్లో ఒక్కొక్కరికి ఒక్కో ఎక్స్ ట్రా కరిక్యులర్ ట్యాలెంట్ ఉంటుంది. శ్రుతిహాసన్ .. మమతా మోహన్ దాస్.. నివేధ థామస్ లాంటి భామలు గాయనీమణులుగా రాణించారు. ఇప్పుడు తమన్నా ఏకంగా కవయిత్రిగా సత్తా చాటుతోంది. అది కూడా తన టీవీ షో హోస్టింగ్ లో ఈ ట్యాలెంట్ ని బయటపెట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది.ఇటీవల తమన్నా కెరీర్ ఉత్తమ దశలో ఉంది. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటించింది. ఏడాది కాలంగా బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బిజీగా ఉంది. గత సంవత్సరం నుంచి చాలా ప్లాట్ ఫామ్ లలో తన ఉనికిని చాటుకుంటుంది. ఓవైపు ఓటీటీలో నటిస్తూనే పెద్ద తెర అవకాశాల్ని విడిచిపెట్టడం లేదు. మరోవైపు టీవీ హోస్టింగ్ కి రెడీ అయ్యింది. మాస్టర్ చెఫ్ తెలుగు షోతో తమన్నా టీవీ హోస్ట్ గా మారుతోంది. ఇప్పుడు మరో విధంగానూ వార్తల్లోకొచ్చింది. తమన్నాలో హిడెన్ కవయిత్రిని బయటపెట్టడం అందరినీ ఆకర్షిస్తోంది. కవిత్వంపై ఇష్టాన్ని సోషల్ మీడియాలలో తమన్నా బయటపెడుతోంది. ఇటీవల తరచుగా ట్విట్టర్లో కోట్స్ రాస్తోంది. అవన్నీ కవితలుగా అలరిస్తున్నాయి.ఆమె తన లోతైన ఆలోచనలను కవిత్వం రూపంలో బయట పెట్టిన విధానం చూస్తుంటే గొప్ప కవిత్వాన్ని సృష్టించడంలో నైపుణ్యం ఉందని ప్రూవ్ అవుతోంది. ఆమె కోట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. గోపిచంద్ సరసన నటించిన సీటీమార్ రిలీజ్ కి రావాల్సి ఉంది. ఇందులో జ్వాలా రెడ్డిగా తమన్నా నటించారు. తమిళంలోనూ పలు చిత్రాలతో తమన్నా బిజీగా ఉంది.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**